సాక్షి
మంచిర్యాల
మంగళవారం। 1। అక్టోబర్। 2024



డీఎస్సీలో సత్తాచాటారు
రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని యువతీ, యువకులు సత్తాచాటారు. కష్టపడి చదివి కొలువుకు చేరువయ్యారు. 8లో▸



పట్టు సాగుతో రైతులకు లబ్ధి
పట్టు పురుగుల పెంపకంతో అధిక లాభాలు గడించవచ్చని రాష్ట్ర పట్టు పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ లత, సెంట్రల్ సిల్క్‌బోర్డు సైంటిస్టు వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. 10లో▸



వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఒకటి రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రసవత్తరంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్



పరుగు పందెంలో శిక్షణ కానిస్టేబుళ్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లోని పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ కానిస్టేబుళ్ల స్పోర్ట్స్ మీట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండోరోజు సోమవారం క్రికెట్, పరుగు పందెం, టగ్‌అఫ్‌వార్ తదితర పోటీలు నిర్వహించారు. బుధవారం విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని కమాండెంట్ వెంకటరాములు తెలిపారు. పోటీలను అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.నాగేశ్వర్‌రావు, ఆర్ఐలు, ఏఆర్ఎస్సైలు పర్యవేక్షించారు.

అట్టహాసంగా జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు



జోనల్‌స్థాయికి ఎంపికైన క్రికెట్ జట్టు

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో సోమవారం అండర్-14 బాలుర జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 2న నిర్మల్‌లో జరిగే జోనల్ పోటీల్లో పాల్గొననున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీరామ్‌మోహన్ పోటీలను ప్రారంభించారు. పోటీల ఆర్గనైజర్ సిరంగి గోపాల్, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ రేణి రాజయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, కరీమున్నీసా, సాంబమూర్తి, ఇందిర పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుని కూతురుకు ఎంబీబీఎస్‌లో సీటు



నాగమణి

జన్నారం: జన్నారం మండలం పొనకల్‌కు చెందిన గల్ఫ్ కార్మికుడు దుమల్ల ఎల్లయ్య కూతురు నాగమణి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. నాగమణి 1 నుంచి 4వ తరగతి వరకు పొనకల్ పాఠశాలలో చదివి గురుకుల పాఠశాలలో సీటు సాధించింది. నిర్మల్‌లోని గురుకుల పాఠశాలలో 5 నుంచి పదో తరగతి వరకు చదివి, లక్సెట్టిపేట గురుకుల పాఠశాలలో ఇంటర్ పూర్తి చేసింది. ఇంటర్ అనంతరం నీట్ పరీక్ష రాసింది. మెడికల్ కౌన్సెలింగ్‌లో నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



స్వాగతం పలుకుతున్న తిరుపతివర్మ

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రస్థాయి యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 29, 30 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగిన పోటీల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన రాహుల్ బంగారు పతకం, వైష్ణవి వెండి పతకాలు సాధించారు. బెంగళూరులో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతివర్మ, ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్, శిక్షకులు శ్రావణ్ తెలిపారు. ఇద్దరినీ సన్మానించారు.

జీవో 25ను సవరించాలి



మాట్లాడుతున్న కార్యదర్శి బండి రమేశ్

మంచిర్యాలఅర్బన్: జీవో 25ను సవరించి ప్రాథమిక పాఠశాలలను పరిరక్షించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ డిమాండ్ చేశారు. మంచిర్యాల పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలన్నారు. సరెండర్ లీవ్, జీపీఎఫ్ మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లులు విడుదల చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే దసరా తర్వాత ఉద్యమాలు చేస్తామని తెలిపారు. తపస్ ప్రధాన కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

ఆ పదెకరాలేవి?



జిల్లా కేంద్రంలో గోదావరి రోడ్‌కు ఉన్న భూదాన్ భూమి

- భూదాన్ భూముల్లో జైలు నిర్మాణం
- ఖాళీగా ఉన్న 12 ఎకరాలు కేటాయింపు
- కబ్జా అయిన పదెకరాలపై పట్టింపు కరువు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలోని భూదాన్ భూములు ఆక్రమణలపై పట్టింపు కరువైంది. జిల్లా కారాగార నిర్మాణానికి 12 ఎకరాలు కేటాయించిన అధికార యంత్రాంగం పూర్తి భూమి స్వాధీనంపై మాత్రం దృష్టిపెట్టడం లేదు. జిల్లాలో ప్రస్తుతం లక్సెట్టిపేటలో సబ్ జైలు ఉంది. జిల్లా జైలు నిర్మాణానికి జైళ్ల శాఖ నుంచి ప్రతిపాదన వచ్చింది. ఇందుకు 25 ఎకరాల స్థలం కావాలని కోరింది. అయితే 12 ఎకరాలు కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ఈ మేరకు మంచిర్యాల తహసీల్దార్ మ్యాప్‌తోసహా నివేదిక సమర్పించారు. దీంతో జైలు నిర్మాణానికి త్వరలోనే అడుగులుపడే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే.. భూదాన్‌భూమిలో ఇప్పటికే మాతాశిశు సంరక్షణ కేంద్రం నిర్మించారు. జిల్లా కలెక్టరేట్ భవనం కూడా ఇక్కడే నిర్మించాలని మొదట ప్రతిపాదించారు. కానీ, అభ్యంతరాలు రావడంతో ప్రతిపాదన విరమించుకున్నారు. అయితే ఇప్పటికీ భూదాన్ బోర్డుకు కేటాయించిన వాస్తవ భూమిని స్వాధీనం చేసుకోవడంపై మాత్రం అధికారులు దృష్టిసారించడం లేదు. విలువైన



భూదాన్ బోర్డు భూమిలోఉన్న కృషి శిక్షణ కేంద్రం

భూమిని కాపాడుకునేందుకు అధికారులు ముందుకు రాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. తాజాగా ఆక్రమణలో ఉన్న ఆ పదెకరాల జోలికి పోకుండా ఖాళీగా ఉన్న జాగాలోనే జైలు కోసం కేటాయించడం గమనార్హం.

ఆ పదెకరాలు పోయినట్లేనా !
దేశవ్యాప్తంగా ఆచార్య వినోభాబావే భూదానోద్యమం పిలుపు మేరకు 1952లో సర్వే నంబర్ 707, 708, 65లో 38.27 ఎకరాల సొంత భూమిని పట్టాదారులు రాజావెంకటమురళీమనోహర్‌రావు, గోనె రాజేశ్వర్‌రావులు దానం చేశారు. నిబంధనల ప్రకారం భూదాన్ యజ్ఞ బోర్డుకు భూమిని అప్పగించారు. ఈ భూమిని సాగుకోసమే వినియోగించాలి. నిర్మాణాలు చేపట్టరాదు. అయితే 'ఆచార్య కుల ట్రస్టు' కింద కృషి శిక్షణ కేంద్రం కోసం రెండెకరాలు కేటాయించింది.

వదిలేసుకున్న అధికారులు
భూదాన్ బోర్డు ట్రస్టు రికార్డుల్లో నుంచి పూర్తిగా ఆ పదెకరాలు తొలగిపోయాయి. దీంతో ఆ పదెకరాల భూమివైపు అధికారులెవరూ వెళ్లడం లేదు. దీంతో ప్రైవేటు వ్యక్తులు పదెకరాలకు కంచె వేసి మధ్యలో నుంచే రోడ్డు వేశారు. నిర్మాణాలు చేపట్టారు. అయినా అధికారయంత్రాంగం అడ్డుచెప్పడం లేదు. ఇప్పటికీ ధరణిలో నిషేధిత జాబితాలో సర్వే నంబర్ 707లోని 17.38 ఎకరాలు, 708/ఆలోని 20.01 ఎకరాలు ఉంది. మరోవైపు ఏకలవ్య ఆశ్రమం వెనకవైపు రోడ్డు, విద్యుత్ లైన్‌ను ఓ రియల్టరు నిర్మించిన విల్లాల అమ్మకాలకు ఇదే రోడ్డు చూపి విక్రయాలు చేస్తున్నాడు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రజా ఉపయోగాలకు భూదాన్ భూములు కేటాయించినప్పటికీ ఆక్రమణలకు గురైన భూమిని రెవెన్యూ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యవసాయ పరిశోధనలకు మాత్రమే ఉపయోగించేలా నాటి సర్కారు నిబంధన పెట్టింది. అక్కడ ప్రస్తుతం ఓ ఆశ్రమం కొనసాగుతోంది. మిగతా 36.27ఎకరాలకు కేర్‌టేకర్‌గా ఉన్న ఓ మహిళ, ఆమె కుమారుడికి 10 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆయన మరణం తర్వాత తల్లిపేరుతో 10 ఎకరాలు అసైన్ చేసింది. అదే భూమి 2006 నాటికి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది. వీటిపై ఫిర్యాదులు రావడంతో భూదాన్ యజ్ఞబోర్డు సర్వే నంబరు 65/2లోని 0.28 ఎకరాలు, 707లోని 4.26 ఎకరాలు, 708లోని 4.26 ఎకరాలు మొత్తం పదెకరాలు ట్రస్ట్ పేరుతో కాస్తు కాలంలో ఉన్న ఆక్రమణదారుల పేర్లు తొలగించి 'బడూదాన ఖారీజు ఖాతా'గా నమోదు చేయాలని తహసీల్దార్‌కు లేఖ పంపింది. తర్వాత సామాజిక కార్యకర్త తుల మధుసూదన్‌రావు కోర్టులో కేసు వేయగా, 2014లోనే బోర్డుకే భూములు చెందుతాయని స్పష్టం చేసింది. ఆ మేరకు అప్పటి ఆర్డీవో సైతం పట్టా రద్దు చేయాలంటూ ఆదేశాలు ఇచ్చారు. అయితే రెవెన్యూ అధికార యంత్రాంగం జాప్యంతో ఆ భూమిని స్వాధీనం చేసుకోలేకపోయారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దు

- అధికారులు సమయపాలన పాటించాలి
- కలెక్టర్ కుమార్ దీపక్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దని, జాప్యం చేయకుండా సమస్యలు పరిష్కరించాలని తమ పరిధిలోకి రాకుంటే వెంటనే ఫిర్యాదుదారుకు తెలియజేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో కలిసి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి కొన్ని శాఖలకు సంబంధించి జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, కిందిస్థాయి సిబ్బంది హాజరు అవుతున్నారని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. అధికారులు సమయపాలన కూడా పాటించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. భూ సమస్యలు, పింఛన్, పరిహారం, రుణమాఫీ, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయి.

పింఛన్ అందించాలి..



నాభర్త లేదు.. నేను ఇళ్లలో పనిచేసి కూతురుతో కలిసి బతుకుతున్నాం. నా కూతురు శివాణిశ్రీకి 7 ఏళ్లు. మానసిక దివ్యాంగురాలు. సదరం క్యాంపులో వైద్యులు 100 శాతం మానసిక వైకల్యం ఉన్నట్లు గుర్తింపు సర్టిఫికెట్ ఇచ్చారు. పింఛన్ ఇవ్వడం లేదు.

– జోదే రాజక్క, శివాణిశ్రీ, అశోక్‌రోడ్, మంచిర్యాల

అక్రమ రిజిస్ట్రేషన్‌ను అడ్డుకోవాలి..



బెల్లంపల్లి బజార్ ఏరియా బెల్లంపల్లి 30వార్డులో ఉన్న స్థలం, ఇంటి నం 10–3 బిఏ, స్థలం 734.37 చదరపు ఫీట్స్ గల భూమిని 2023 సంవత్సరంలో నా పేరుమీద రిజిస్ట్రేషన్ అయింది. ఈ ఇంటిలో ఉన్న కన్నయ్య సింగ్ అనే చికెన్ సెంటర్ వ్యాపారి తన సామగ్రి పెట్టి తనపేరుమీద అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను అడ్డుకోవాలి.

– భైరి కిరణ్‌కుమార్, బెల్లంపల్లి

రుణమాఫీ చేయాలి



నా పేరుమీద 32 వేలు, మా నాన్న పేరు మీద 90 వేల పంట రుణం ఉంది. రుణమాఫీ పథకం మాకు వర్తించలేదు. రుణమాఫీకి అర్హులమైనా మాఫీ కాలేదు. ఎందుకు మాఫీ కాలేదో చెప్పడం లేదు. మాఫీ అయ్యేలా చూడాలి.

– దుర్గం మహేందర్, తాండూర్

రుణం ఇవ్వడం లేదు..



పట్టాపాసుపుస్తకాలు ఉన్నా పంట రుణాలు ఇవ్వడం లేదు. గిరిజన రైతులమైన మేము మా తాతలకాలం నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్నాం. రుణం ఇవ్వనప్పుడు పట్టాలు ఇచ్చి ఏం లాభం. రైతు బంధు, పీఎం కిసాన్ పైసలు కూడా పడ్డయ్. రుణం ఇస్తలేరు. బ్యాంకు అధికారులను అడిగితే ధరణి ఆన్‌లైన్ కాలేదని చెబుతున్నరు. – కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి దాంపూర్ మహిళా రైతులు

ఆమెదే ఆధిక్యం

- పంచాయతీ ఓటరు జాబితా విడుదల
- గ్రామీణ ఓటర్లు 3,78,934 మంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలపై ఎలాంటి స్పష్టత లేకపోయినప్పటికీ గ్రామ పంచాయతీల్లో అధికారులు ఓటరు జాబితా సిద్ధం చేశారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల మెటీరియల్, ఇతర సామగ్రి సమకూర్చడంలో నిమగ్నమయ్యారు. శనివారం ఫొటోలతో కూడిన తుది ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వద్ద కార్యదర్శులు ప్రదర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సహాయ ఎన్నికల అధికారులుగా ఉన్న ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు ఈ ఓటరు జాబితాలను సిద్ధ చేశారు.

3,78,934 మంది ఓటర్లు..
జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి డివిజన్ల పరిధిలో 16 మండలాలు ఉన్నాయి. మొత్తంగా 311 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో దండేపల్లి మండలం వందూరుగూడ పంచాయతీ ఏర్పడిననాటి నుంచి ఎన్నికలు జరుగలేదు. జిల్లా వ్యాప్తంగా 311 పంచాయతీల్లో 1,87,412 మంది పురుష ఓటర్లు, 1,91,505 మంది మహిళా ఓటర్లు, 17 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. మొత్తంగా జిల్లాలో 3,78,934 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్ల కన్నా 4,093 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. మండలాల వారీగా కూడా మహిళా ఓటరే అధికంగా ఉన్నారు.



హాజీపూర్‌లో ఓటరుజాబితా ప్రదర్శిస్తున్న కార్యదర్శులు

మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

మండలం	జీపీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
బెల్లంపల్లి	17	156	11,399	11,476	1	22,876
భీమిని	12	100	5,769	5,574	1	11,344
భీమారం	11	94	6,328	6,517	–	12,845
చెన్నూర్	30	244	12,863	13,118	–	25,981
దండేపల్లి	30	278	20,072	21,056	1	41,129
హాజీపూర్	17	156	13,363	13,737	–	27,100
జైపూర్	20	186	14,934	14,902	1	29,837
కన్నెపల్లి	15	130	7,519	7,738	1	15,258
జన్నారం	29	272	21,144	22,137	2	43,282
కాసిపేట	22	190	12,895	13,014	4	25,913
కోటపల్లి	31	258	13,206	13,363	2	26,571
లక్సెట్టిపేట	18	160	12,008	12,591	–	24,599
మందమర్రి	10	86	5,590	5,644	1	11,235
నెన్నెల	19	158	9,433	9,505	–	18,941
తాండూర్	15	144	13,436	13,643	2	27,081
వేమనపల్లి	14	118	7,453	7,487	1	14,941
మొత్తం	311	2,730	1,87,412	1,91,505	17	3,78,934

వేడి.. ఉక్కపోత



మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు అవుతున్నా... నాలుగు రోజులుగా జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు.ఉక్కపోతతో జిల్లా వాసులు విలవిలలాడుతున్నారు. ఎండల తీవ్రతతో బయటకు వెళ్లేవారు తలకు రక్షణగా గుడ్డ లేదా, గొడుగు తీసుకెళ్తున్నారు. జూలై, ఆగస్టు నెల్లో భారీ వర్షాలు కురిశాయి. సెప్టెంబర్‌లోనూ భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగాయి. చెరువులు, కుంటలు, వివిధ జలాశయాలు నిండుకుండలా మారాయి. అయినా వేడి, ఉక్క పోత తగ్గకపోవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మంగళవారం నుంచి శీతకాలం సీజన్ ప్రారంభం కానుంది. అయినా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం తగ్గడం లేదు.

నేటి నుంచి డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

మంచిర్యాలఅర్బన్: డీఎస్సీ 2024లో ఫలితాల్లో ఉత్తీర్ణులై 1:3 వెరిఫికేషన్ కోసం ఎస్ఎంఎస్, ఈమెయిల్ అందుకున్న అభ్యర్థులు ఈనెల 1 నుంచి 10 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రావాలని డీఈవో యాదయ్య సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు జతల జిరాక్స్ కాపీలు గెజిటెడ్ అధికారి సంతకంతో తీసుకుని కార్మెల్ హైస్కూల్‌లో వెరిఫికేషన్‌కు రావాలని తెలిపారు.

క్రీడా మైదానానికి కేటాయించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్ 707, 708 లో ఉన్న భూదాన్ భూములను క్రీడా మైదానానికి కేటాయించాలని పౌరసేవా సంస్థ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం వినతిపత్రం అందించారు. 12 ఎకరాల్లో పార్కు, క్రీడ మైదానం ఏర్పాటు చేస్తే పట్టణ ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు.

పదోన్నతి చిహ్నాలు అందజేత



పదోన్నతి పొందిన వారితో సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: ప్రభుత్వ ఉద్యోగాల్లో పదోన్నతి లభించడం ద్వారా బాధ్యత పెరుగుతుందని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన ఆరుగురికి పదోన్నతి చిహ్నాలను కమిషనరేట్ ఆవరణలోవారి యూనిఫాంకు అలంకరించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోటపల్లి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని రామగుండం సీపీ శ్రీనివాసులు సూచించారు. కోటపల్లి పోలీస్‌స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను ఎస్సై రాజేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించాలని ఆదేశించారు. రాత్రివేళల్లో తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రాణహిత, మహారాష్ట్ర సరిహద్దు మండలం అయినందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో నిరంతర తనిఖీలు చేయాలని అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచాలని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీపీ ప్రారంభించారు. సీపీ వెంట సీఐ సుధాకర్, ఎస్సై శ్యాంపటేల్, ఏఆర్ ఎస్సైలు ఉన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు నూతన మార్గదర్శకాల ప్రకారం 2024–25 సంవత్సరానికి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి జిల్లా ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ మూడు దశల్లో ఉంటుందని, డెమో అథెంటికేషన్, బయోమెట్రిక్ అథెంటికేషన్, రిజిస్ట్రేషన్ దశలు ఉంటాయని వివరించారు. మొదటి దశలో ఈ-పాస్ వెబ్‌సైట్‌లో నూతన/రెన్యువల్ రిజిస్ట్రేషన్ భాగంగా తన ఆధార్‌కార్డు నంబర్‌ను సమర్పించి ఎస్సెస్సీ వివరాలతో సరి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వివరాలు సరి అయిన తరువాత తదుపరి దశలో బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయాలని, ఒకవేళ వివరాలు సరికానట్లయితే సంబంధిత విద్యార్థి తన ఆధార్ వివరాలను మీసేవ కేంద్రంలో అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. మూడో దశలో గతంలో మాదిరిగా సంబంధిత ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసి ఉపకార వేతన వివరాలు పూర్తిగా నింపి దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. మూడు దశల్లో దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన తర్వాత సదరు దరఖాస్తు తదుపరి ప్రక్రియ కోసం సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు తగు సూచనలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పట్టభద్రుల ఓటరు నమోదు షురూ



బోర్డుపై ఎన్నికల షెడ్యూల్ అంటిస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు ప్రక్రియతోపాటు, ఎన్నికల షెడ్యూల్‌ను ఆర్డీవో కార్యాలయంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయ సిబ్బంది సోమవారం అంటించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం ఫారం–18, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కోసం ఫాం–19 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదుకు నవంబర్ 6వ తేదీ వరకు అవకాశం ఉందని ఎన్నికల డీటీ శ్రావణి, ఇన్‌చార్జి డీఏవో శ్రీహరి తెలిపారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాలకు జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు డిగ్రీ ఉత్తీర్ణత తప్పనిసరి ఉండాలి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకునే వారు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు. అయితే యూడైస్‌లో నమోదైన ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే ఓటు హక్కును కల్పించనున్నారు. www.ceotelangana.nic.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఓటరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: పట్టుభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హతగలవారు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కుమార్ దీపక్ సూచించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణ విడుదల చేసినట్లు తెలిపారు.

మేడం.. వియ్ మిస్‌యూ



చెన్నూర్ మండలం కొమ్మెర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పనిచేసిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలు గోసంగారి విజయలక్ష్మి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మేడం తమ ఉన్నతికి ఆరేళ్లుగా చేసిన కృషిని విద్యార్థులు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పేద విద్యార్థులకు సాయం చేసేవారి, సబ్జెక్టుతోపాటు సామాజిక అంశాలపై అవగాహనకల్పించారని తెలిపారు. మేడం రిటైర్ అయి వెళ్లిపోవడం బాధగా ఉందని పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిలో మేడంను కూర్చోబెట్టి పాఠశాల ఆవరణలో ఊరేగించారు. కార్యక్రమంలో ఎంఈవో రాధాకృష్ణమూర్తి, హెచ్‌ఎం ఎస్.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రమీల, దత్త కుమార్, గోపాల్, టంకసాల రవీందర్, ప్రకాశ్‌రెడ్డి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. – చెన్నూర్‌రూరల్

క్లుప్తంగా

పాముకాటుకు ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

కెరమెరి: మండలంలోని దేవాపూర్ గ్రామంలో పాముకాటుకు ఎద్దు మృతిచెందింది. సోమవారం ఉదయం పొలం గట్టులో ఎద్దు మేత మేస్తుండగా పాముకాటేయడంతో మృతి చెందిందని బాధిత రైతు జాదవ్ దశరథ్ తెలిపాడు. దీని విలువ రూ.70 వేలు ఉంటుందని అధికారులు ఆదుకోవాలని కోరాడు.

డెంగీ లక్షణాలతో వివాహిత మృతి



భైరి శ్రీలత (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్ గ్రామానికి చెందిన వివాహిత భైరి శ్రీలత (24) డెంగీజ్వరంతో [illegible] తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలికి భర్త వినీత్, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు

తాండూర్: ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు పెంచుతున్న ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కామెర దుర్గయ్య తన ఇంటి ఆవరణలో నిషేధిత గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం అందింది. వెంటనే సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా 8 గంజాయి మొక్కలు కనిపించాయి. ఆ మొక్కలను స్వాధీనం చేసుకుని కామెర దుర్గయ్యను అదుపులో తీసుకున్నామని ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ కథనం ప్రకారం.. కూరగాయల మార్కెట్లో మునీమ్‌గా పనిచేస్తున్న పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఎండీ యాకుబ్ 2021 మే 21న తాటిగూడకు చెందిన మహ్మద్ ఇంతియాజ్‌కు వ్యవసాయ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4.50 లక్షలు డిమాండ్ చేశాడు. అతని వద్ద నుంచి మొదట రూ.2.50 లక్షలు తీసుకున్నాడు. తన బాబాయి ఎండీ సలీమ్ వ్యవసాయ కార్యాలయంలో పనిచేస్తాడని, తన ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. మాయమాటలు చెప్పి డబ్బులు తీసుకుని కనిపించకుండా పోయాడు. బాధితుడికి ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు సైతం తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధితుడు ఫిర్యాదుతో సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై తెలిపారు.

వేమనపల్లిలో చోరీ

వేమనపల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నవునూరి పుల్లయ్యకు చెందిన కిరాణా దుకాణంలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దొంగలు ఆ ఇంటి వంటగదిలోకి చొరబడి టీవీ టేబుల్ డెస్క్‌లో 3 తులాల బంగారం, మూడు వరుసల గొలుసును ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న సీఐ సుధాకర్, ఎస్సై శ్యాంపటేల్‌లు సోమవారం ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా సమీపంలో ఓ భవనంలో నిర్వహిస్తున్న [illegible]

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం రేషన్‌డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మోటపల్కుల [illegible]

డీఎస్సీలో సత్తాచాటారు

- ఉమ్మడిజిల్లాలో పలువురు అర్హత
- కష్టపడి చదివి ర్యాంకులు పొందిన యువత



రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని యువతీ, యువకులు సత్తాచాటారు. కష్టపడి చదివి అర్హత సాధించి మంచి ర్యాంకులు సాధించారు. కొందరు తొలిప్రయత్నంలో అర్హత సాధించగా, మరికొందరు టీటీసీ పూర్తిచేసి టీచర్ కొట్టాలని కోచింగ్ తీసుకుని డీఎస్సీ పరీక్ష రాసి ప్రతిభ కనబర్చారు.

మంచిర్యాల జిల్లాలో 18వ ర్యాంకు..



దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన యాగండ్ల సాయిప్రసూన. 2019లో టీటీసీ పూర్తి చేసింది. టీచర్ ఉద్యోగం సాధించాలనే తపనతో ఏడాది కోచింగ్ తీసుకుంది. గత ఆగస్టులో డీఎస్సీ పరీక్ష రాసింది. 80.93 మార్కులు సాధించి, జిల్లాలో 18వ ర్యాంకు సాధించింది.

– యాగండ్ల సాయిప్రసూన

ఎలాంటి కోచింగ్ లేకుండానే..



దండేపల్లికి చెందిన గుర్రం మురళీమోహన్ –సుజాత దంపతులు వ్యవసాయం చేస్తుంటారు. వారి కూతురు తేజశ్విని రెండేళ్ల క్రితం టీటీసీ పూర్తిచేసింది. డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడింది. ఇంటివద్దనే ఉండి డీఎస్సీకి ప్రిపేర్ అయింది. 76.70 మార్కులు సాధించి, జిల్లా 52వ ర్యాంకు సాధించింది.

– గుర్రం తేజశ్విని, దండేపల్లి

తొలి ప్రయత్నంలోనే..



దండేపల్లి మండలం నర్సాపూర్ చెందిన పూరెళ్ల అనూష. గతంలో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగ ప్రయత్నాలు చేసింది. ఒకటి, రెండు మార్కుల తేడాతో మిస్ అయ్యాయి. టీటీసీ చేయడంతో, టీచర్ ఉద్యోగ సాధన కోసం కోచింగ్ తీసుకుని, 77.09 మార్కులతో జిల్లా 36వ ర్యాంకు సాధించి, తొలి ప్రయత్నంలోనే డీఎస్సీ అర్హత సాధించింది.

– పూరెళ్ల అనూష

జిల్లా స్థాయిలో 29వ ర్యాంకు..



నర్సాపూర్‌కు చెందిన పూరెళ్ల అఖిల. డీఎస్సీ అర్హత పరీక్షలో 78.87 మార్కులు సాధించి, జిల్లా స్థాయిలో 29వ ర్యాంకు సాధించింది. డీఎస్సీలో అర్హత సాధన కోసం ఆరునెలల కోచింగ్ తీసుకుని, మంచి మార్కులు సాధించింది. తొలి ప్రయత్నంలో అర్హత సాధించడం పట్ల సంతోషంగా ఉంది.

– అఖిల

మొదటి ప్రయత్నంలోనే..



కౌటాల: నాగేపల్లికి చెందిన వాడాయి సుధాకర్ కుమురం భీం జిల్లాలో 35వ ర్యాంకు సాధించారు. కౌటాల ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదివి జనగాంలో డైట్ పూర్తి చేశారు. ఇంటి వద్ద ఆన్‌లైన్ క్లాసులు వింటూ డీఎస్సీకి ప్రిపేర్ అయ్యారు. తొలి ప్రయత్నంలోనే 78.3 మార్కులు సాధించిన ఆయన్ను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సుధాకర్‌ను అభినందించారు.

–సుధాకర్

మహిళా కానిస్టేబుల్ డబుల్ ధమాకా



బెల్లంపల్లి: డీఎస్సీ ఫలితాల్లో మహిళా కానిస్టేబుల్ ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపికై డబుల్ ధమాకా సాధించింది. బెల్లంపల్లి మండలం బుధాకుర్దుకు చెందిన వీర్ల మౌనిక వన్‌టౌన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. ఈమె తల్లిదండ్రులు వీర్ల రామయ్య, వజ్రమ్మ దంపతులు. మౌనిక 2020లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. భర్త రాజ్‌కుమార్ సింగరేణి కార్మికుడు. ఇద్దరు తోబుట్టువుల్లో రెండో అన్న వినోద్‌కుమార్ ఎక్సైజ్ ఎస్సైగా పని చేస్తుండగా కిరణ్‌కుమార్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. మౌనిక డీఎస్సీ నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసింది. రెండు నెలలు పోలీసు ఉద్యోగానికి సెలవు పెట్టి హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్‌లో జాయిన్ అయింది. డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌ఏ, ఎస్జీటీ ఉద్యోగాలకు ఎంపికై సత్తా చాటింది. ఇటీవల హాస్టల్ వార్డెన్ ఉద్యోగాన్ని సొంతం చేసుకుంది.

– తల్లిదండ్రులతో మౌనిక

డీఎస్సీలో అర్హత



అప్పాజి గణేశ్



అప్పాజి సతీశ్



అనిల్

పెంచికల్‌పేట్: డీఎస్సీ ఫలితాల్లో యువకులు అర్హత సాధించారు. ఎల్లూర్‌కు చెందిన అన్నదమ్ములు అప్పాజి గణేశ్, అప్పాజీ సతీశ్‌లు ఎస్‌ఏ సోషల్‌లో జిల్లా రెండు, మూడు ర్యాంకులను సాధించారు. అనిల్, సాయిగౌడ్‌లు ఎస్జీటీ విభాగంలో జిల్లా 8, 17 ర్యాంకులు, చేడ్వాయికు చెందిన అశోక్ ఎస్జీటీ జిల్లా 21 ర్యాంకు సాధించారు. చేడ్వాయికి చెందిన రోజా, బొంబాయిగూడకు చెందిన సాయి, ఎల్లూర్‌కి చెందిన రమాకాంత్, మల్లన్న, రవీందర్, ప్రియాంక, లోడుపల్లికి చెందిన కిశోర్ ప్రతిభ చాటారు.



సాయిగౌడ్



అశోక్

నిరుపేద కుటుంబం నుంచి..



కోటపల్లి: మండలంలోని శెట్‌పల్లికి చెందిన వేముల రాజం, లక్ష్మీల కూతురు స్వాతి ఎస్జీటీలో జిల్లాలో 23వ ర్యాంక్ సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన స్వాతి చిన్ననాటి నుంచే చదువులో ముందు ఉండేది. 2021లో స్వాతికి అసంపల్లి సంపత్‌తో వివాహం కాగా పెళ్లి అయ్యాక కూడా భర్త సహకారంతో చదువును కొనసాగించింది.

– వేముల స్వాతి

భౌతికశాస్త్రంలో జిల్లా టాపర్



ఆంజనేయులు

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్‌కు చెందిన ఏకారి ఆంజనేయులు భౌతిక శాస్త్రంలో జిల్లా టాపర్‌గా నిలిచాడు. ఏకారి సత్యనారాయణ–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా కుమారుల్లో ఆంజనేయులు చిన్నవాడు. బజ్జీల బండిపెట్టి వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నా తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ ఆంజనేయులు కష్టపడి చదివి డీఎస్సీకి ప్రిపేర్ అయ్యాడు. భౌతిక శాస్త్రం విభాగంలో జిల్లాలో ఒకే పోస్టు ఉండగా పరీక్ష రాసి జిల్లా టాపర్‌గా నిలిచాడు. తల్లిదండ్రులు, భార్య సంధ్య ప్రోత్సాహంతోనే సాధించానని ఆంజనేయులు తెలిపాడు.

ర్యాంక్‌లు సాధించిన ఇద్దరు



సంతోష్



సాయికుమార్

ఆసిఫాబాద్‌రూరల్: బూర్గుడలోని బీసీ కాలనీకి చెందిన అనుమడ్ల సంతోష్ ఎస్జీటీలో 82.10 మార్కులతో జిల్లాలో 12వ ర్యాంక్ సాధించారు. తల్లి శశికళ, తండ్రి శంకర్ రోజు వారిగా కూలీ పని చేస్తున్నారు. వీరికి ఐదుగురు కుమారులు. ఇందులో సంతోష్ ఎలాంటి కోచింగ్ లేకుండా ఇంటివద్దనే చదివి సత్తాచాటాడు. అదే గ్రామానికి చెందిన సత్తయ్య, తార దంపతుల కుమారుడు సాయికుమార్ ఎస్జీటీలో 75 మార్కులతో జిల్లాస్థాయిలో 60వ ర్యాంక్ సాధించాడు.

ఫైనాన్స్ వేధింపులతో ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన పాలెప్‌వార్ రాజేశ్ సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రదీప్ కథనం ప్రకారం.. రాజేశ్ (39) స్థానికంగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, ఏడాది క్రితం ప్రైవేట్ ఫైనాన్స్‌లో టాటా మేజిక్ వాహనం కొనుగోలు చేశాడు. ఈఎంఐలు సక్రమంగా చెల్లించకపోవడంతో రెండురోజుల కిందట ఫైనాన్స్ సిబ్బంది హెచ్చరించి వెళ్లిపోయారు. దీంతో మనస్తాపం చెందిన రాజేశ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పేర్కొన్నారు. భార్య జయశ్రీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి..



బుచ్చన్న మృతదేహం

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన కొప్పుల బుచ్చయ్య (50) అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. బుచ్చయ్య గత నాలుగేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్తానని సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆయన మోసపోవడంతో గల్ఫ్ దేశానికి వెళ్లలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చేందుకు మేదరిపేట సమీపంలోని 4 గుంటల భూమిని అమ్మాడు. అయినా అప్పులు పూర్తిగా తీరలేదు. అవి తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపం చెందాడు. ఇంట్లో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. కుటుంబీకులు, స్థానికులు గమనించి, మంచిర్యాల ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుమారుడు మహేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి



విజయలక్ష్మి (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని మేదరివాడకు చెందిన చింత విజయలక్ష్మి (47) సోమవారం అనుమానాస్పదంగా మృతిచెందింది. సమాచారం అందుకున్న సీఐ బన్సిలాల్ ఘటనస్థలాన్ని పరిశీలించారు. మృతురాలి మెడపై, చేతులపై కమిలిపోయిన గాయాలు ఉన్నాయి. విజయలక్ష్మి భర్త గతంలో మృతి చెందింది. కుమార్తె భవితకు వివాహమైంది. భర్త చనిపోయిన నాటి నుంచి విజయలక్ష్మి ఒంటరిగా ఉంటోంది. గత కొంత కాలంగా ఆమెకు బంధువుల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయని కుమార్తె భవిత ఆరోపించింది. కుమార్తె ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు



శ్రీనివాస్ (ఫైల్)

నస్పూర్: బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుగుణాకర్ కథనం ప్రకారం..శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాకు చెందిన వంగ శ్రీనివాస్(38) బట్టల వ్యాపారి తన మిత్రుడి రాకేశ్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై పని నిమిత్తం మంచిర్యాలకు వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగివస్తుండగా సుమంగళి ఫంక్షన్ హాల్ సమీపంలో జాతీయరహదారి వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. శ్రీనివాస్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలైన రాకేశ్‌ను ఆసుపత్రికి తరలించారు. భార్య అమృత ఫిర్యాదుతో సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామ సమీపంలోని కుంటలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్సై భీంరావు పేర్కొన్నారు. మృతుడు నీలం నలుపు చెక్స్‌తో కూడిన షర్ట్ ధరించి నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. అతని వయస్సు 30 నుంచి 40 వయస్సు మధ్య ఉంటుందని, స్థానికుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

బాసర: బాసర గోదావరి నదిలో గతనెల 27న గల్లంతైన మహిళ మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు..నిజామాబాద్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు బాసర గోదావరి నదిలో స్నానానికి వచ్చారు. జయ (41) గోదావరి నదిలో నీటమునిగింది. గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా, లోకేశ్వరం మండలం బ్రహ్మేశ్వర్ వద్ద గోదావరి నదిలో సోమవారం జయ మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల పరిరక్షణకు పోరాటం

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

శ్రీరాంపూర్: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ పోరాటం చేస్తుందని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే. రాజ్‌కుమార్ తెలిపారు. ఆర్కే 5 గనిలో సోమవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులతో మాట్లాడారు. సింగరేణిలో కార్మికుల పొందుతున్న అనేక హక్కులు, సదుపాయాలు ఏఐటీయూసీ పోరాట ఫలితమే అన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, ఫిట్ సెక్రెటరీ గునిగంటి నర్సింగరావు, నాయకులు లక్కిరెడ్డి సత్తిరెడ్డి, మల్లేష్, భోగం మదనయ్య, జీపీ రావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం



మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. కేకే–5 గనిపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణికి గత ఆర్థికసంవత్సరం వచ్చిన లాభాల వాటా పంపిణీపై కొన్ని సంఘాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. టీబీజీకేఎస్ గత పదేళ్ల కాలంలో ఉద్యోగులకు ఏం చేసిందని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు కంది శ్రీనివాస్, రాజేశం, సంపత్ పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలురు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి పోటీలో రాణించాలని డీఎస్‌వో మీనారెడ్డి, ఎస్జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన దర్శ క్రీడ పాఠశాలలో ఎస్జీజీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అండర్–17 బాల,బాలికలకు జోనల్ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ఏసీఎంవో ఉద్ధవ్ ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 84 మంది బాల బాలికలు పాల్గొన్నారని, ఇందులో ప్రతిభ కనబర్చిన 16 మంది బాలురు, 16 మంది బాలికలను రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరికి కొస్గి నారాయణపేట్ జిల్లాలో ఈనెల 3 నుంచి 5 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కోచ్ అరవింద్, పీడీలు పీటీలు రాకేశ్, సాయి, దీపిక, విద్యా సాగర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలికలు

వాగు దాటి.. సర్వే చేసి



వాగు దాటి సర్వే కోసం వెళ్తున్న అధికారులు

నెన్నెల: మండలంలోని గుండ్లసోమారంలో సర్వే నం.117 నుంచి 135వరకు విరాసత్ కోసం రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ దరఖాస్తులను గుర్తించడానికి మండల ఆర్‌ఐ సులోచన, సర్వేయర్ దశరథం ఎడ్లబండిపై వాగు దాటి వెళ్లారు. సర్వే కోసం రెవెన్యూ అధికారులు ఎడ్లబండిపై వచ్చి సర్వే చేపట్టడం ఆనందంగా ఉందని రైతులు రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

గృహిణి మృతిపై విచారణ



వివరాలు సేకరిస్తున్న వైద్య అధికారులు

నస్పూర్: ఆర్‌ఎంపీ ఇచ్చిన వైద్యం వికటించి గృహిణి మృతి చెందిన ఘటనపై ప్రభుత్వ వైద్య అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. నస్పూర్‌లోని నాగార్జునకాలనీలోని చింతం శ్రీలత (24) మృతి పట్ల వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టామని మెడికల్ ఆఫీసర్ సమత తెలిపారు. మృతురాలి ఇంటి చుట్టుపక్కల వారి నుంచి, ఆర్‌ఎంపీ ప్రశాంత్ నుంచి వివరాలు సేకరించామని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రాన్ని, పరిసరాలను పరిశీలించి సేకరించిన రిపోర్టులను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అనిత, సీహెచ్‌వోలు రమేశ్, రామ్మూర్తి, హెల్త్‌అసిస్టెంట్ వెంకట్, ఏఎన్‌ఎంలు వినోద, సునంద, ఆశవర్కర్ ఉన్నారు.

పోలీస్ బందోబస్తు.

మృతురాలి దహన సంస్కరాల నేపథ్యంలో నాగార్జున కాలనీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పీఎంపీ క్లినిక్, అతని ఇంటి వద్ద ముందస్తు బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి ఆందోళనలు లేకుండా అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిసింది. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, సీసీసీ నస్పూర్, శ్రీరాంపూర్, హాజీపూర్ ఎస్సైలు సుగుణాకర్, సంతోష్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ రిమాండ్‌కు తరలింపు

చింతం శ్రీలత మృతి చెందిన ఘటనలో ఆర్‌ఎంపీ ప్రశాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. మృతురాలి తండ్రి సత్తయ్య ఫిర్యాదుతో ప్రశాంత్‌ను అదుపులో తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. సీసీసీ నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌కు నోటీసులు



క్లినిక్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: సాక్షిలో 'ఆర్‌ఎంపీ వైద్యం ...ప్రాణ సంకటం'శీర్షికన వచ్చిన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సోమవారం స్పందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హరీశ్‌రాజ్ మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో అనితను విచారణ నిమిత్తం ప్రశాంత్ నిర్వహిస్తున్న నస్పూర్‌లోని క్లినిక్‌ను తనిఖీ చేసి, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు దాన్ని తెరవద్దంటూ నోటీసులు జారీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేసి, దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. అనుమతి లేకుండా ఇష్టారీతిన ఇంజక్షన్లు వేయడం, చికిత్స అందించడం చేస్తే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

అడవులతో పర్యావరణ రక్షణ



మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో సుభాష్

లక్సెట్టిపేట: అడవులతోనే పర్యావరణానికి రక్షణ ఉటుందని ఫారెస్టు రేంజి అధికారి అత్తె సుభాష్ అన్నారు. మండల కేంద్రంలోని గుడ్‌షెప్పర్ పాఠశాల విద్యార్థులకు సోమవారం జెండావెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి తలమల గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వనదర్శిని సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు అడవిలో ఉండే వృక్షాలు, వాటి రక్షణ, అడవుల విలువలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో హపీజోద్దీన్, బీట్ అధికారులు సత్త య్య, చంద్రశేఖర్, రాజశేఖర్, రాజమణి పా ఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.